సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



రంజాన్ స్పెషల్.. సుర్మా

రంజాన్ కఠోర ఉపవాసం చేసే ముస్లింలు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తారు. దీనిలో భాగంగా కంటి కింద భాగంలో సుర్మా రాసుకుంటారు.


8లో



ధాన్యం దిగుబడి భేష్

తాడేపల్లిగూడెం మండలంలో వరి సిరులు కురిపిస్తోంది. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. మాసూళ్లు జరుగుతున్నాయి.

8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
భీమవరం	6.23	4.38
ఏలూరు	6.26	4.35

న్యూస్‌రీల్

చంద్రబాబుకు చెంప దెబ్బ ఖాయం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



తాడేపల్లిగూడెం: చంద్రబాబుకు 2024 ఎన్నికల్లో చెంపదెబ్బ ఖాయమని డిప్యూటీ సీఎం, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ జోస్యం చెప్పారు. ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్ల విషయంలో వలంటీర్లను తప్పించడంపై సోమవారం ఆయన ఇక్కడ స్పందించారు. ఒకటో తేదీ వచ్చిందంటే వలంటీర్ వేకువజామున వచ్చి పెన్షన్ ఇస్తారని వేచి చూసే వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు నిరాశ ఎదురైందన్నారు. రాష్ట్రంలోని 69 లక్షల మంది పెన్షన్‌దారుల నోటి దగ్గర కూడు లాగేసుకున్నట్టు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఈనాడు రామోజీరావు కలిసి కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. టీడీపీ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులను ఎలా ఇబ్బందులకు గురిచేశారో అదే మాదిరి మళ్లీ చేయాలని నీచ రాజకీయాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారన్నారు. ఆనాడు చంద్రబాబు తొత్తులాగా నిమ్మగడ్డ పనిచేసి కరోనా లేనప్పుడు ఉందని ఎన్నికల విషయంలో ఆటంకాలు కల్పించారని విమర్శించారు. వాళ్లు చేస్తున్న ద్రోహాలను ప్రజలు గమనిస్తున్నారని, వీటికి పర్యవసానంగా మే 13న తీర్పు ఇవ్వనున్నారన్నారు. వీళ్లందరికి బుద్ధి చెప్పే రోజు దగ్గరలో ఉందని మంత్రి కొట్టు చెప్పారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో తీర ప్రాంతం, లంక గ్రామాలను దృష్టిలో పెట్టుకుని ప్రస్తుత వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట ప్రణాళికలు రూపొందించుకుని అమలు చేస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డికి వివరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి వేసవిలో తాగునీటి సరఫరా, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై కలెక్టర్లతో ఆయన సమీక్షించారు. తాగునీటి చెరువులను, సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, మంచినీటి చెరువులను కాలువలు కట్టేసేలోపు పూర్తిస్థాయిలో నింపుకోవాలని సూచించారు. రానున్న రోజుల్లో వేడిగాలులు అత్యధికంగా వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికల దృష్ట్యా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఉపాధి హామీలో నీటి సంరక్షణ, మంచినీటి చెరువుల డీసిల్టింగ్ పనులకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు.

'ఓపెన్' పరీక్షలకు 314 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్మీడియెట్ కోర్సు ప్రాక్టికల్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. భౌతికశాస్త్రం పరీక్షకు 139 మందికి 107 మంది, రసాయన శాస్త్రం పరీక్షకు 147 మందికి 128 మంది, జీవశాస్త్రం పరీక్షకు 100 మందికి 79 మంది హాజరయ్యారు. జిల్లాలో ఎక్కడా ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

'పది' మూల్యాంకనం ప్రారంభం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం సోమవారం స్థానిక సెయింట్ గ్జేవియర్ పాఠశాలలో ప్రారంభమైంది. మూల్యాంకనానికి 1,020 మందిని నియమించినట్టు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు. కేంద్రంలో ఉపాధ్యాయులకు తాగునీటి సౌకర్యం, పరిశుభ్రమైన వాతావరణం, గాలి, వెలుతురు సక్రమంగా ఉండేలా ఏర్పాట్లుచేశారు. వీటిని డీఈఓ దగ్గరుండి పర్యవేక్షించారు. మూల్యాంకన విధుల్లో చీఫ్ ఎగ్జామినర్లు 114 మంది, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 678 మంది, స్పెషల్ అసిస్టెంట్లు 228 మంది భాగస్వాములయ్యారన్నారు. జిల్లాకు 1.99 లక్షల జవాబుపత్రాలు వచ్చాయన్నారు. ప్రతి ఎగ్జామినర్ రోజుకు 40 జవాబుపత్రాలను దిద్దాల్సి ఉంటుందన్నారు. ఈనెల 8 వరకు మూల్యాంకన ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

సేవకులకు అడ్డంకులు

కుట్రలు కని'పెంఛెన్'

- వలంటీర్ వ్యవస్థతో ప్రజల చెంతకు పాలన
- కోవిడ్ విపత్తుల వేళ ఆదర్శంగా సేవలు
- జిల్లాలో 8,820 మంది ద్వారా పథకాల అందజేత
- 1వ తేదీ వేకువజామునే పింఛన్ పంపిణీ
- టీడీపీ ఫిర్యాదులతో వలంటీర్ల సేవలపై ఈసీ ఆంక్షలు
- ఈనెల పింఛన్ అందక వృద్ధుల ఎదురుచూపులు
- టీడీపీ తీరుపై మండిపడుతున్న లబ్ధిదారులు, ప్రజలు



ఆకివీడులో కరోనా సమయంలో ప్రజలకు కూరగాయలు పంపిణీ చేస్తున్న వలంటీర్లు (ఫైల్)



ఆకివీడులో భారీ వర్షాలకు ముంపునకు గురైన ప్రాంతాల్లో పాల ప్యాకెట్లు అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

సాక్షి, భీమవరం: ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పాలనలో సరికొత్త అధ్యాయానికి తెరలేపిన వలంటీర్ల సేవలకు తెలుగుదేశం పార్టీ అవాంతరాలు సృష్టిస్తోంది. తెరవెనుక తప్పుడు ఫిర్యాదులతో ప్రజలకు సేవలందకుండా అడ్డంకులు కలిగిస్తోంది. ప్రతి నెలా ఒకటో తారీఖున వేకువజామున ఇంటికే వచ్చి పింఛన్లు అందించే వలంటీర్లు టీడీపీ బ్యాచ్ నిర్వాకంతో పొద్దుపోయినా జాడలేకపోయారని అవ్వాతాతలు ఆవేదన చెందుతున్నారు.

చెంతకే పథకాలు అందిస్తూ..

ప్రభుత్వ పథకాలకు అర్హుల గుర్తింపు, సంక్షేమ లబ్ధిని ప్రజల చెంతకు చేరవేయడంలో సీఎం జగన్ తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ పాలనలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది. కుల,మత, వర్గాలు, రాజకీయాలకు అతీతంగా, అవినీతి, అక్రమాలకు తావులేకుండా పనిచేస్తోంది. జిల్లాలో 8,820 మంది వలంటీర్లు ప్రతి నెల ఇంటి వద్దకే పింఛన్ల పంపిణీతో పాటు అనారోగ్యంతో ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల చెంతకు సైతం వెళ్లి ప్రభుత్వ సాయాన్ని అందజేస్తున్నారు. అలాగే ప్రభుత్వ పథకాల అందజేత, సర్టిఫికెట్ల జారీ, ఆరోగ్య పరీక్షలు అందించడంతో ప్రధాన భూమిక పోషించారు. పథకాల కోసం పేదలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఇంటికే వచ్చి దరఖాస్తులు చేయిస్తున్నారు. విద్యుత్ బిల్లులు, ఆస్తి పన్నుల చెల్లింపు తదితర సేవలను అందిస్తూ కుటుంబంలో ఒక సభ్యునిగా గుర్తింపు పొందారు.

విపత్తుల వేళ.. ఆపద్బంధులా..

కరోనా సమయం, రాష్ట్రంలో ప్రకృతి విపత్తులు సంభవించిన సమయంలో వలంటీర్లు ఎనలేని సేవలందించారు. అయినవాళ్లే దూరంగా ఉన్న వేళ బాధితులుగా బాసటగా నిలిచారు. కరోనా హోం క్వారంటైన్‌లో ఉన్న వారికి ప్రభుత్వం వలంటీర్ల ద్వారా ఆహారం, నిత్యావసర సరుకులు, మందులు అందించింది. బాధితులకు కరోనా పరీక్షలు, వాక్సినేషన్ ప్రక్రియలో వలంటీర్లు కీలక సేవలు అందించారు. గోదావరి వరదల సమయంలో నీట మునిగిన లంక గ్రామాల ప్రజలకు ప్రభుత్వ సాయాన్ని, సరుకులు, మందులు ఇంటింటికీ వెళ్లి అందించి భేష్ అనిపించారు.

నిత్యం విషం కక్కుతూ..

రూ.5,750 నామమాత్రపు గౌరవ వేతనంతో నిస్వార్థంగా సేవలందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు, పవన్‌కల్యాణ్, ఎల్లో మీడియా నిత్యం విషం కక్కుతూనే ఉన్నారు. తాజాగా టీడీపీ అనుకూల సంస్థ ఫిర్యాదుతో వలంటీర్ల సేవలపై ఎన్నికల సంఘం ఆంక్షలు విధించడంతో వారి సేవలకు ఆటంకం ఏర్పడింది. మళ్లీ పాత పద్ధతిలో పింఛన్లు తీసుకునే పాట్లు తాము పడలేమని అవ్వాతాతలు, వలంటీర్ల వలనే తమకు ప్రభుత్వ పథకాలు లబ్ధి చేకూరిందని ప్రజలు ప్రతిపక్షాల కుట్ర రాజకీయాలను ఎండగడుతున్నారు.

ఎనలేని సేవలందిస్తూ..



ఎక్కడా లేనివిధంగా వలంటీర్ వ్యవస్థను సీఎం జగన్ తీసుకువచ్చారు. గ్రామీణ ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తున్నారు. గతంలో కార్యాలయాల చుట్టూ తిరగలేక చాలా మంది పథకాలు వదిలేసుకున్నారు. సీఎం జగన్ హయాంలో వలంటీర్లు ఇంటికే వచ్చి పథకాలు అందించడం భేష్.

– ఉండ్రాజవరపు రాజు, జగన్నాథపురం

పింఛన్ కోసం ఎదురుచూశా..



నేను ఓ హోటల్‌లో పనిచేసుకుని జీవిస్తున్నా. రెండేళ్ల నుంచి వలంటీర్ మా ఇంటికే వచ్చి వితంతు పింఛన్ అందిస్తున్నారు. ఈ రోజు 1వ తేదీ కావడంతో పింఛన్ కోసం ఎదురుచూశాను. వలంటీర్ రారని తెలిసింది. ఒక పక్క నేను పనికి వెళ్లకపోతే కుదరదు. ఏం చేయాలో తోచడం లేదు.

– చిరగపల్లి లక్ష్మి, నరసాపురం

చంద్రబాబుకి బుద్ధి చెబుతాం



నా వయసు 80 ఏళ్లు. కళ్లు సరిగ్గా కనిపించవు. వలంటీర్ తలుపు తట్టి పింఛన్ ఇచ్చేవారు. ఈనెల పింఛన్ డబ్బులు ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకోవడం చాలా దారుణం. ఈ ఎన్నికల్లో అతడికి బుద్ధి చెబుతాను. మాలాంటి ముసలోళ్లను ఏడిపించడం న్యాయం కాదు

–దాయం నాగేశ్వరరావు, వాలమర్రు, పాలకొల్లు మండలం

వలంటీర్లను తొలగిస్తే సహించం



వలంటీర్ ఇంటికి వచ్చి యోగక్షేమాలు తెలుసుకుంటుంది. కోవిడ్ సమయంలో వైద్యం, మందులు, కూరగాయలు, బియ్యం అందజేసింది. నాకు పింఛన్ ఇస్తోంది. నా మనుమరాలికి ఆసరా, కాపు నేస్తం ఇప్పించింది. వలంటీర్లు బాగా సేవలందిస్తున్నారు. వారిని తొలగిస్తే సహించం

–బండి భద్రమ్మ, దుంపగడప, ఆకివీడు మండలం

నా పరిస్థితి ఏంటి



నాకు కళ్లు కనిపించవు. కాళ్లు పనిచేయక మంచానికే పరిమితమయ్యాను. మా ప్రాంతం నుంచి సచివాలయం 2 కిలోమీటర్లలో ఉంది. ఇప్పటివరకు ఇంటికే పెన్షన్ అందించడంతో ఇబ్బంది లేదు. ఈనెల పింఛన్ ఎవరు అందిస్తారనే ఆందోళన ఉంది. నా పరిస్థితి ఏంటో అర్థం కావడం లేదు.

– కురుమ కృపావరం, కె.బేతపూడి, నరసాపురం మండలం

మమ్మల్ని బాధపెడతారా?



నిబంధనల పేరుతో వలంటీర్ సేవలకు ఆటంకం కలిగిస్తే మాలాంటి పేదలకు దిక్కెవరు. పింఛన్ కోసం సచివాలయానికి కిలోమీటరు పైనే నడిచి వెళ్లాలి. మాలాంటి ముసలోళ్లు ఎందరో కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. రాజకీయాల కోసం మమ్మల్ని బాధపెడతారా.

–రాజమంద్రి పైడమ్మ, ఎన్నార్పీ అగ్రహారం

వలంటీర్లపై కక్ష కట్టి ..



సీఎం జగన్ పెద్దకొడుకులా ఆలోచించి వలంటీర్ల ద్వారా ఇంటికే పింఛన్ అందించారు. ఇప్పుడు చంద్రబాబు పుణ్యమా కక్ష కట్టి వలంటీర్లను రాకుండా చేశారు. బీపీ, షుగరు, కాళ్ల నొప్పులతో ఉన్న నేను కార్యాలయాల చుట్టూ తిరగలేను. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి.

– అలుగు దీవెనమ్మ, పెద అమిరం, కాళ్ల మండలం

ఆందోళనగా ఉంది



ఈనెల పింఛన్ పంచాయతీకి వెళ్లి తెచ్చుకోవాలని తెలిసింది. నాకు దివ్యాంగ పింఛన్, నా భార్యకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. ఇద్దరం కూడా రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పంచాయతీకి ఎలా వెళ్లాలా అని ఆందోళనగా ఉంది. ప్రతినెలా మా మనుమడిలా వలంటీర్ పింఛన్ అందించేవాడు.

– గుడిమెట్ల కనికిరెడ్డి, దివ్యాంగుడు, పెనుమంట్ర

గతంలో ఇలాంటి ఇబ్బందులే..



నాలుగున్నరేళ్లుగా ఇంటి వద్దే పింఛన్ సొమ్ములు తీసుకున్నా. ఇప్పుడు టీడీపీ వాళ్లు చేసిన పని వల్ల మాలాంటి వృద్ధులంతా చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈనెల పింఛన్ ఎవరు ఇస్తారో, ఎప్పుడు ఇస్తారో తెలియదు. గత టీడీపీ పాలనలో ఇలాంటి ఇబ్బందులే పడ్డాం.

– చేబ్రోలు నాగరత్నం, రేలంగి, ఇరగవరం మండలం

మండుతున్న ఎండలు

- ఉదయం 9 నుంచే ఎండ తీవ్రత
- 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదు
- చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు



భీమవరంలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

భీమవరం(ప్రకాశం చౌక్)/తణుకు: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మార్చి చివరి వారం నుంచి ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచి ఎండ పెరుగుతూ మధ్యాహ్నం 12 గంటల సమయంలో తీవ్రరూపం దాల్చుతోంది. దీంతో జనం ఇబ్బంది పడుతున్నారు. జిల్లావ్యాప్తంగా సగటున 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతల పానీయాల బాట పడుతున్నారు. జిల్లాలోని భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు పట్టణాల్లో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులు సైతం మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి.

ముందస్తు జాగ్రత్తలు

జిల్లాలో ప్రతి బస్టాండ్, రైల్వేస్టేషన్, ముఖ్యమైన కూడలిలో చలివేంద్రాలు ఏర్పాటు, ఉచిత తాగునీటి సరఫరాకు కలెక్టర్ సుమిత్‌కుమార్ చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రజలు వడదెబ్బ బారినపడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, వృద్ధుల ఆరోగ్య పరిరక్షణకు అధిక ప్రాధాన్యమివ్వాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఉపాధి హామీ పథకం కూలీలు, కార్మికులు ఉదయం, సాయంత్రం పనులు చేసేలా, పనులు చేసే చోట చలివేంద్రాలు ఏర్పాటుకు ఆదేశించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులకు దాహార్తిని తీర్చేలా చర్యలు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



ఎండ తీవ్రత పెరుగుతుండటంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. ఎండల్లో తిరగడం, ప్రయాణించడం వల్ల వడదెబ్బ బారిన పడే అవకాశం ఉంది. ఎండల్లో ప్రయాణించాల్సి వస్తే కచ్చితంగా తలకు టవల్ లేదా టోపీ పెట్టుకోవాలి. వడదెబ్బ తగిలిన వ్యక్తిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆస్పత్రికి తీసుకువెళ్లాలి. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలో చలివేంద్రాల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వడదెబ్బకు గురైన వారి కోసం విలేజ్ క్లినిక్ దగ్గర నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకు వైద్యులు, మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ మహేశ్వరరావు,
జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు



గణపవరం మండలం పిప్పరలో రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు

గణపవరం/ఉండి: గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన సుమారు 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వలంటీర్ల వ్యవస్థపై తెలుగుదేశం పార్టీ వ్యవహరిస్తున్న తీరు బాధాకరంగా ఉందని, ప్రజలకు తాము నిస్వార్థంగా సేవలు అందిస్తున్నామన్నారు. తమను సేవలందించకుండా ప్రజలకు దూరం చేయడం సరికాదని, అందుకే తాము రాజీనామాలు సమర్పిస్తున్నామని అన్నారు.

వేధింపులు తాళలేక మరో ఇద్దరు

ఉండి : టీడీపీ, జనసేన నాయకుల వేధింపులు భరించలేక వలంటీర్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్టు ఉండి మండలం ఉణుదుర్రు సచివాలయ వలంటీర్లు పొట్ల నిహారిక, డి.సూర్యకుమారి సోమవారం తెలిపారు. సీఎం జగన్ తమకెంతో గుర్తింపు ఇచ్చారని, ప్రజలతో తాము మమేకమయ్యామన్నారు. అయితే తాము ఎక్కడికి వెళ్లినా గ్రామంలోని టీడీపీ, జనసేన నాయకులు ఫొటోలు తీసి అధికారులకు పంపుతున్నారన్నారు. లేనిపోని కట్టు కథలు అల్లి అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. కనీసం సాధారణ వ్యక్తుల్లా బయట తిరగనీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సైతం కనీస విచారణ చేయకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఇటీవల గ్రామంలో 9 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారన్నారు. ఈ నేపథ్యంలో రాజీనామా చేస్తున్నామని, ఇకపై తమ పరిధిలోని ప్రజలకు సీఎం జగన్ ప్రభుత్వం చేసిన మంచిని వివరిస్తామని చెప్పారు.

ఓటు నమోదుకు 14 వరకు అవకాశం

భీమవరం (ప్రకాశంచౌక్): ఓటు హక్కు పొందేందుకు ఈనెల 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా అర్హులేనని, వారు ఈనెల 14లోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. కొత్త ఓటు లేదా చిరునామా మార్పు కోసం ఈనెల 14లోపు వచ్చే దరఖాస్తులను మాత్రమే పరిశీలిస్తామని పేర్కొన్నారు. వీరికి మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం కల్పిస్తామన్నారు. వాస్తవానికి అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసే వరకూ ఓటు నమోదుకు అవకాశం ఉందని, అయితే వాటిని పరిశీలించి జాబితాల్లో చేర్చడానికి సమయం సరిపోకపోవడంతో ఈనెల 14న దరఖాస్తుల గడువుగా నిర్ణయించారన్నారు. జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ తుది దశకు చేరుకుందన్నారు. 18 ఏళ్లు నిండినవారు ఓటర్ హెల్ప్‌లైన్ యాప్, ఆన్‌లైన్‌లో ఫారం–6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిరునామా, ఓటు మార్పు కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందినవారి పేర్లను అనుబంధ జాబితా ద్వారా, అలాగే చనిపోయిన వారు, బదిలీ ఓటర్ల వివరాలను ఏఎస్‌డీ జాబితాలో నమోదు చేస్తామన్నారు. ఈ ఏడాది మార్చి 30 నాటికి జిల్లాలో సుమారు 14,61337 మంది ఓటర్లు ఉన్నారన్నారు. కొత్త ఓటర్ల చేర్పు కొనసాగుతుండంతో సంఖ్య క్రమంగా పెరుగుతుందన్నారు. ఓటుపై సందేహం ఉంటే ఓటర్ల జాబితాల్లో పేర్లను ఆన్‌లైన్ ద్వారా సరిచూసుకోవచ్చని తెలిపారు. బూత్‌ల వారీగా కూడా ఓటర్ల జాబితాలను ప్రకటించామన్నారు. కలెక్టరేట్‌లోని ఎన్నికల కంట్రోల్ రూమ్ ఫోన్ 08816–299616, 08816–299617 నంబర్లను సంప్రదించి ఓటు వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ సూచించారు.

ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్



భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికల ప్రవర్తన నియమావళిని అనుసరించి రాజకీయ పార్టీల ప్రచార వ్యయాన్ని పక్కాగా లెక్కించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్యతో కలిసి జిల్లాస్థాయి ఎన్నికల వ్యయ పర్యవేక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎలక్ట్రానిక్, ప్రింట్, కేబుల్ నెట్‌వర్క్, సోషల్ మీడియా, బహిరంగ సభలు, ర్యాలీల ద్వారా ప్రచారాలు, స్టార్ క్యాంపెయినర్, హెలికాప్టర్ ఖర్చులు, పాంప్లెట్లు, పోస్టర్ల ప్రింటింగ్, వాహనాలు, వీడియో తదితర ఖర్చుల లెక్కింపు సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రచారాలకు సంబంధించి ముందస్తు అనుమతులు తప్పనిసరి అన్నారు. ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తు అనుమతి ఇవ్వడంతో పాటు చెల్లింపు వార్తలను (పెయిడ్ న్యూస్), స్టార్ క్యాంపెయినర్ల ప్రచారం, ఇతర ఉల్లంఘనలు పక్కాగా గుర్తించాలన్నారు. ఎలక్ట్రానిక్ ప్రచారానికి రిజిస్టర్డ్ పార్టీలు మూడు రోజులు, రిజిస్టర్ కాని పార్టీలు ఏడు రోజుల ముందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వీటిని పరిశీలించి జిల్లాస్థాయి ఎంసీఎంసీ కమిటీ అనుమతి మంజూరు చేస్తుందన్నారు. వార్తాపత్రికల్లో పోలింగ్ రోజు, పోలింగ్‌కు ముందు రోజు తప్పనిసరిగా ఎంసీఎంసీ నుంచి అనుమతి పొందిన తర్వాతే ప్రకటన ప్రచురించాల్సి ఉందన్నారు. అలాగే సినిమా హాళ్లు, ప్రైవేట్ ఎఫ్‌ఎం రేడియోలు, ఎలక్ట్రానిక్ పత్రికల్లో ప్రచార ప్రకటనలు కూడా ముందస్తు ధ్రువీకరణ తప్పనిసరి అన్నారు. టెలికాస్ట్ సర్టిఫికెట్ పొందిన తర్వాత మాత్రమే టీవీ/కేబుల్/రేడియో/ప్రచార వాహనాల్లో ప్రకటనలు ఇవ్వాలన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవన్నారు. డీఆర్వో జె.ఉదయభాస్కర రావు, ఆర్డీఓలు కె.శ్రీనివాసులు రాజు, ఎం.అచ్యుత అంబరీష్, కె.చెన్నయ్య, ఆర్వోలు బి.శివనారాయణరెడ్డి, వి.స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఈఓ సమీక్ష

85 ఏళ్లు దాటిన వృద్ధులు, సదరం సర్టిఫికెట్ ఆధారంగా 40 శాతం దాటిన అంగవైకల్యం ఉన్న దివ్యాంగులకు ఇంటి వద్దే ఓటు కల్పించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. సోమారం విజయవాడ నుంచి ఆయన పోస్టల్ బ్యాలెట్ వినియోగం, వృద్ధులు, విభిన్న ప్రతిభావంతుల ఓటు హక్కు వినియోగం తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ, అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

ఏలూరు (టూటౌన్): బాల్య వివాహాలు చేయడం, బాల కార్మికులతో పనులు చేయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కెపీవీఎల్ పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి అన్నారు. బాల్య వివాహాలు చేస్తే రూ.లక్ష జరిమానా, జైలు శిక్ష విధిస్తారన్నారు. బాలలను పనుల్లో పెట్టుకోరాదన్నారు. బాల్య వివాహాలు గాని, భిక్షాటన చేస్తున్న పిల్లల గురించి గాని తెలిస్తే.. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు లేదా 94910 63810 నెంబరుకు సమాచారం అందించాలన్నారు.

క్రైస్తవుల మద్దతు జగన్‌కే



భీమవరంలో మాట్లాడుతున్న క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రతినిధులు

భీమవరం(ప్రకాశం చౌక్): క్రైస్తవుల మద్దతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే అని క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధికారి ప్రతినిధి గుర్రం జార్జి బెన్‌హర్ అన్నారు. సోమవారం భీమవరంలో విలేకర్లతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి తన పాలనలో క్రైస్తవులకు ఎంతో మేలు చేశారన్నారు. అనేక సంక్షేమ పథకాలతో ఆదుకున్నారన్నారు. పాస్టర్లుకు గౌరవ వేతనం అందించి గౌరవించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8,400 మంది పాస్టర్లకు గౌరవ వేతనం అందించిన ఘనత దేశంలోనే మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు మేడిది జాన్సన్ ఆధ్వర్యంలో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్ళీ ముఖ్యమంత్రి చేసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. క్రిస్టియన్ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పొన్నమల్లి సంపదరావు, బేతాళ సంతోష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.జాన్ ఎడ్వర్డ్, ఎం.రత్నకుమార్, కార్యదర్శులు మేడిది శ్యామ్, రత్నకుమార్, కరుణాకర్, స్టాన్లీ రాబర్ట్, ప్రభాకర్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ స్పెషల్.. సుర్మా

- రంజాన్ మాసంలో ప్రత్యేక స్థానం
- సుర్మా పెట్టుకోవడం పవిత్రమని ముస్లింల నమ్మకం



సుర్మా చూర్ణం



సుర్మా పెట్టుకున్న ముస్లిం సోదరులు



మార్కెట్‌లో అందుబాటులో ఉన్న సుర్మా ఉత్పత్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రంజాన్ అంటేనే ముస్లింలలో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. కఠోర ఉపవాసం చేసే ముస్లింలు ఈ నెలలో ఆరోగ్య పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తారు. ప్రత్యేకంగా తయారు చేసే జావ, జీడిపప్పు, బాదం పప్పు, ఖర్జూరం, హలీం వంటివి ఆహారంలో తప్పనిసరిగా ఉండేలా చూసుకుంటారు. దీంతో పాటే ఉపవాస సమయంలో సుర్మాకు ప్రాధాన్యత ఉంటుంది. సుర్మా అంటే ప్రకాశవంతం, వెలుగు నిచ్చేదని అర్థం. ఈ రంజాన్ మాసంలో కాటుకలా ఉండే సుర్మాను కళ్లకు పెట్టుకుంటారు. ప్రవక్త మూసా సుర్మాను తొలిసారి వాడినట్లు ముస్లింల నమ్మకం.

రంజాన్‌లో ఎక్కువగా వాడకం

సాదా సుర్మా, ముమెరా సుర్మా అని రెండు రకాలు ఉంటాయి. ముమెరా సుర్మాను వేసవిలో కంటి చల్లదనం కోసం వినియోగిస్తారు. సాదా సుర్మాను అన్ని వేళల్లో వాడొచ్చు. సౌదీ అరేబియా నుంచి నల్లటి రాళ్ల ముక్కలను దిగుమతి చేసుకొని వాటిని పొడిగా మార్చి రోజ్‌వాటర్ కలిపి సుర్మా తయారు చేస్తారు. దీనిని ఎక్కువగా రంజాన్ మాసంలో, నమాజుకు ముందు పూసుకుంటారు.

కంటికి చల్లదనం

సుర్మా కంటి కింది భాగంలో పూసుకునే ఒక పదార్థం. దీనిని కాటుకలా వాడుతారు. కంటికి పెట్టుకుంటే చల్లదనం ఇస్తుంది. రంజాన్ మాసంలో సుర్మా పెట్టుకుంటే పుణ్యం దక్కుతుందని ముస్లిం సోదరుల నమ్మకం. సుర్మాతో కంటి వ్యాధులు రావని నిరూపితం కావడంతో కేవలం ముస్లింలే కాక ఇతర మతాల వారు కూడా సుర్మాను వినియోగిస్తున్నారు. రంజాన్ నెలలో రోజా ఉన్నవారు తమ కళ్లకు సుర్మా పెట్టుకోవడం మరచిపోకూడదు. సుర్మాను పెట్టుకోవడాన్ని సున్నత్ అంటారు. ముస్లింలు అందమైన భరిణెలలో వీటిని దాచుకుని ఇంటికి వచ్చిన అతిథులకు అత్తర్‌తో పాటు కళ్ళకు పెట్టుకోవడానికి సుర్మా ఇవ్వడం సాంప్రదాయం. ఉపవాసదీక్షలో ఉన్నవారు సుర్మా పెట్టుకోవడం పవిత్రంగా భావిస్తారు.

ఆధ్యాత్మికత, ఆరోగ్యాల కలగలుపు



సుర్మాకు ముస్లింలలో ప్రత్యేక స్థానం ఉంది. నమాజుకు ముందు సుర్మా పెట్టుకోవడం సంప్రదాయంగా వస్తోంది. సుర్మా ధారణ ముస్లింలలో పవిత్రతకు, ఆధ్యాత్మికతకు, ఆరోగ్యాల మేళవింపుగా విశ్వసిస్తాం. ప్రవక్త మూసా ప్రారంభించిన సుర్మా వినియోగాన్ని అప్పటి నుంచి యావత్తు ముస్లిం జాతి సాంప్రదాయంగా పాటిస్తోంది.

షేక్ హుస్సేన్, ప్రభుత్వ ఖాజీ

రంజాన్‌లో డిమాండ్ ఎక్కువ



రంజాన్ మాసంలో సుర్మా వినియోగం ఎక్కువ. సాధారణ రోజుల్లో హిందువులు, ఇతర మతస్తులు కూడా దీనిని వినియోగిస్తుంటారు. దీనిని ఉత్పత్తి చేసే సంస్థను బట్టి రూ. 30 నుంచి రూ.300 వరకూ ధర ఉంటుంది. చిన్న పిల్లలకు గులాబ్ సుర్మా, పెద్దలకు ముమెరా (పుదీనా) సుర్మా వినియోగిస్తారు.

షేక్ షబ్బీర్ హుస్సేన్, రాయల్ సెంట్ హౌస్ అధినేత

చంద్రబాబు వ్యాఖ్యలపై డ్రైవర్ల నిరసన



భీమవరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆటో డ్రైవర్లు

భీమవరం (ప్రకాశంచౌక్): శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయలును కించపరిచిన చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని భీమవరం ఆటో డ్రైవర్లు డిమాండ్ చేశారు. భీమవరంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యింటి సత్యనారాయణ మాట్లాడుతూ డ్రైవర్‌ను అసెంబ్లీకి పంపాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూస్తుంటే చంద్రబాబు డ్రైవర్లను అవమానిస్తూ చులకనగా, నీచంగా చూస్తున్నారని అన్నారు. ఆటోడ్రైవర్లకు వాహన మిత్ర ద్వారా సంవత్సరానికి రూ.10 వేల చొప్పున ఇచ్చి గౌరవించారన్నారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోని డ్రైవర్ సోదరులు చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మారోజు గణేష్, పంపన గోపి, నీలాపు రవి, గోసాలకుమార్, డ్రైవర్ సోదరులు పాల్గొన్నారు.

పెన్షన్లు అడ్డుకోవడం దుర్మార్గం



చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): అవ్వాతాతలు, దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ల పంపిణీని చంద్రబాబు తన కార్యకర్త నిమ్మగడ్డ రమేష్ ద్వారా ఆపించారని మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చీకటిమిల్లి మంగరాజు ఆరోపించారు. ఇది వాలంటీర్లపై చంద్రబాబుకు కక్షకు పరాకాష్ట అన్నారు. తాడేపల్లిగూడెంలో సోమవారం మాట్లాడుతూ ప్రజలను ఇబ్బందికి గురిచేయడం ఒక్క చంద్రబాబుకే సాధ్యమని చెప్పారు. రాష్ట్రంలో ఉన్న అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు రోడ్లు మీదకు వచ్చి చంద్రబాబు అండ్ టీంను తిట్టిపోస్తున్నారని, మళ్లీ సీఎంగా జగన్‌హన్‌రెడ్డిని చేస్తామని అంటున్నారన్నారు. వలంటీర్లు రాష్ట్ర వ్యాప్తంగా రాజీనామాలు చేస్తున్నారని, వారి కుటుంబాల ఉసురు కూడా చంద్రబాబు అండ్ టీంకు తగలుతుందన్నారు.

చంద్రబాబు కుట్రలో భాగంగానే..



వడ్డి రఘురాం నాయుడు

తాడేపల్లిగూడెం అర్బన్: పింఛన్లను పంపిణీ చేయకుండా వలంటీర్లను తప్పించడం కుట్రపూరిత చర్య అని ఆక్వాకల్చర్ డెవలప్‌మెంట్ ఆథారిటీ వైస్ చైర్మన్ వడ్డే రఘురాం నాయుడు మండిపడ్డారు. సోమవారం ఆయన స్వగృహంలో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుంపులుగా వచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌చౌదరి ఎలక్షన్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో చంద్రబాబు జేబులో వాడని ప్రజలందరికి తెలుసునన్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలో ఒకటో తేదీ కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఎదురు చూస్తుంటారని, వారి ఆశలపై నీళ్లు చల్లిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఆగ్రహించారు. ఎన్నికల సమయంలోనే ఇన్ని కుట్రలకు పాల్పడుతున్న చంద్రబాబుకు ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పి వైఎస్ జగన్‌కు ముఖ్యమంత్రిగా మళ్ళీ పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

రబీ దిగుబడి భేష్

ఎకరానికి 55 నుంచి 65 బస్తాలు



తాడేపల్లిగూడెం మండలం ఎల్.అగ్రహారంలో వరిపంట

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలో వరి సిరులు కురిపిస్తోంది. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల వరకూ దిగుబడి వస్తోంది. కొన్ని చోట్ల 70 బస్తాల దిగుబడి వచ్చినట్లు సమాచారం. మండలంలో 11 వేలకు పైగా హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుత రబీలో ఎక్సెల్-10, పీఆర్-126, ఎంటీయు 1121 రకాలను రైతులు సాగు చేశారు. ఎక్సెల్-10, పీఆర్-126 రకాలు దాదాపు నాలుగు వేల ఎకరాల్లో పండించారు. ఎక్సెల్ రకం పది రోజుల క్రితమే కోతలు ప్రారంభమయ్యాయి. పీఆర్-126 రకం వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ రెండు రకాలు కలిపి దాదాపు 1500 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయి. మరో 2,500 ఎకరాల్లో కోతలు చేయాల్సి ఉంది. ఎంటీయు 1121 రకం కోతలు ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నాయి. ఆయా రకాల వరి దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి 55 నుంచి 65 బస్తాల దిగుబడి వస్తుందని చెబుతున్నారు.

రూ.1320కి కొనుగోలు

ఎక్సెల్-10, పీఆర్-126 వంటి ప్రైవేట్ రకాల వరి ధాన్యాన్ని మిల్లర్లు 75 కిలోల బస్తా రూ.1320కు కొనుగోలు చేస్తున్నారు. వాతావరణం అనుకూలించడంతో మిల్లర్లు చేలోనే ధాన్యాన్ని పట్టుబడి చేసి మిల్లులకు తరలిస్తున్నారు.

–అన్నపురెడ్డి సత్యనారాయణ, కౌలు రైతు, ఎల్.అగ్రహారం, తాడేపల్లిగూడెం మండలం

మామపై యాసిడ్ దాడి



ప్రగడ నాగేశ్వరరావు, మృతుడు

జంగారెడ్డిగూడెం రూరల్: మామపై అల్లుడు యాసిడ్‌తో దాడికి పాల్పడిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం లక్కవరంలో చోటు చేసుకుంది. తీవ్రంగా గాయపడిన ప్రగడ నాగేశ్వరరావు (65) చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం లక్కవరానికి చెందిన నాగేశ్వరరావుకి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కుమార్తె కృష్ణవేణికి, టి.నర్సాపురం మండలం వల్లంపట్లకు చెందిన లారీ డ్రైవర్ రంగిశెట్టి రమేష్‌కి ఇచ్చి 22 ఏళ్ల క్రితం వివాహం జరిపించారు. రమేష్ కృష్ణవేణిపై వేధింపులకు పాల్పడేవాడు. దీంతో సంవత్సరం క్రితం కృష్ణవేణి పుట్టింటికి వచ్చేసింది. కృష్ణవేణిని మామ తన వద్దకు రాకుండా అడ్డుకుంటున్నాడనే అనుమానంతో సోమవారం అర్ధరాత్రి ఇంటిలో నిద్రిస్తున్న నాగేశ్వరరావుపై యాసిడ్ పోసి హత్యకు ప్రయత్నించాడు. నాగేశ్వరరావు కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, బంధువులు 108 వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఏలూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నాగేశ్వరరావు సోమవారం ఉదయం మృతి చెందాడు. రమేష్ పరారీలో ఉండటంతో డీఎస్పీ రవిచంద్ర ఆధ్వర్యంలో మూడు బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



సంఘటనా స్థలంలో రమేష్ మృతదేహం




నరం రమేష్(ఫైల్)

చింతలపూడి: చింతలపూడి పట్టణానికి చెందిన నరం రమేష్(30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్సై కుటుంబరావు కథనం ప్రకారం పట్టణానికి చెందిన రమేష్ బార్బర్ షాపు నడుపుతున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈనెల 25న ఇంటి నుంచి బయటికి వెళ్ళిన రమేష్ తిరిగి రాలేదు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ సమీపంలోని పొలాల్లో రమేష్ మృతదేహాన్ని గొర్రెల కాపరులు చూసి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. చేతి మణికట్టు కోసుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. చనిపోయి వారం రోజులు అయి ఉంటుందని ఎస్సై తెలిపారు. మృతదేహం కుళ్ళిపోవడంతో సంఘటనా స్థలంలోనే పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కొయ్యలగూడెం: పురుగు మందు తాగి బయ్యన్నగూడెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై జీజే విష్ణువర్ధన్ సోమవారం తెలిపారు. పట్టపు శ్రీహరి (27) మద్యం తాగి భార్యతో తరచూ గొడవపడేవాడు. దీంతో జ్యోత్స్న పది రోజుల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. అక్కడికి వెళ్లి భార్యను రమ్మనగా అత్తింటి వారు పంపలేదు. దీంతో మనస్తాపంతో పురుగులమందు తాగాడు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

తప్పుడు ప్రచారం చేస్తే శిక్ష తప్పదు



జిల్లా పోలీసు కార్యాలయంలో బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎస్పీ అజిత

భీమవరం: సోషల్ మీడియా తప్పుడు ప్రచారాలు, ట్రోలింగ్స్‌ను తీవ్రంగా పరిగణిస్తామని ఎస్పీ వేజెండ్ల అనిత హెచ్చరించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో తప్పుడు ప్రచారాలకు సంబంధించి ఫిర్యాదు చేయాల్సిన వివరాల బ్రోచర్‌ను విడుదల చేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. సోషల్ మీడియాలో ప్రతి పోస్టుకు గ్రూప్ అడ్మినే పూర్తి బాధ్యతని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ఆన్‌లైన్ వేధింపులు, సోషల్ మీడియా ట్రోలింగ్స్, తప్పుడు వార్తల ప్రచారాలకు పాల్పడే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేశామని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. అభ్యంతకర, తప్పుడు వార్త, వదంతులపై తక్షణం స్థానిక పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. అడ్మిన్స్ వివాదస్పద పోస్టులుచేస్తే ఐటీ చట్టం ఐపీసీ సెక్షన్ 153(ఎ) కింద ఐదేళ్లవరకు శిక్ష విధిస్తారన్నారు.

వైఎస్సార్‌సీపీలో 300 మంది చేరిక



భుజబలపట్నంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, జనసేన నాయకులు



కొమరవరంలో శెట్టిబలిజ సంఘ నాయకులతో మంత్రి కారుమూరి

కైకలూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్షాల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. మండలంలోని భుజబలపట్నంలో సోమవారం జరిగిన ప్రజా ఆశీర్వాదయాత్రలో ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ సమక్షంలో టీడీపీ, జనసేనకు చెందిన 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి పార్టీ కండవాలు కప్పి ఆహ్వానించారు. పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక

తణుకు టౌన్: రాష్ట్రంలో బీసీలకు వైఎస్సార్‌సీపీ అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు అనేక పదవులకు బీసీలకు అవకాశం కల్పించారని, వైఎస్సార్‌సీపీ అండగా నిలవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు కోరారు. సోమవారం సాయంత్రం తణుకు రూరల్ మండలం కొమరవరంలోని శెట్టిబజలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కారుమూరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కొమరవరం గ్రామానికి చెందిన 70 శెట్టి బలిజ కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. మంత్రి మాట్లాడుతూ పథకాలన్నీ వలంటీర్ వ్యవస్థ ద్వారా గడప వద్దకే అందజేయడంతో పాటు బ్యాంక్ ఖాతాలో జమచేస్తున్నారన్నారు. పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు. సర్పంచ్ కరిబండి రాజేష్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, సొసైటీ డైరెక్టర్ కేతా ఆంజనేయులు, శెట్టి బలిజ సంఘ నాయకులు వేండ్ర నరసింహమూర్తి, కేతా రాముడు, పాలా దానయ్య, చెల్లుబోయిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.75 వేలు స్వాధీనం



గణపవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సుభాష్, తనిఖీ బృందం సభ్యులు

గణపవరం: ఎక్కువ నగదు తీసుకెళ్లే వ్యక్తులు తగిన ఆధారాలు చూపాలని, లేదంటే నగదు స్వాధీనం చేసుకుంటామని గణపవరం సీఐ ఎంవీ సుభాష్ అన్నారు. గణపవరం మండలం పిప్పర సెంటర్‌లో సోమవారం ఉదయం ప్రత్యేక తనిఖీల్లో నర్సాపురం ప్రాంతానికి చెందిన డి.సూర్యనారాయణ నుంచి రూ.75 వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈసీ నిబంధనల మేరకు రూ.50 వేల కన్నా ఎక్కువ ఉంటే.. తగిన ఆధారాలు చూపకపోతే నగదు స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. అధిక మొత్తంలో నగదు తీసుకెళ్లే వారు తగిన ఆధారాలు, రసీదులు చూపించాలన్నారు.

నగదు సీజ్

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం జాతీయప్రదాన రహదారిపై విద్యుత్ డివిజన్ కార్యాలయం చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీ బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. తనిఖీల్లో కుక్కునూరు సందీప్ నుంచి రూ.69,600 నగదు సీజ్ చేసినట్లు తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. నగదుకు ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో నిబంధనల మేరకు సీజ్ చేసినట్లు చెప్పారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఏలూరు నగర శివారు కొత్తూరు ఇందిరమ్మ కాలనీకి చెందిన గంపా చంటి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చంటి (45)కి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆరేళ్ల క్రితం భార్య అతని నుంచి విడిపోయి పిల్లలతో వేరుగా ఉంటుంది. చంటి ఒంటరిగా ఉండడంతో పాటు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. మనస్తాపానికి గురైన ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఉరి వేసుకుని యువకుడి మృతి



సూర్యప్రకాష్, మృతుడు(ఫైల్)

కైకలూరు: ఇంట్లో ఉరి వేసుకుని యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆటపాక పంచాయతీ జాన్‌పేటకు చెందిన పట్టపు సూర్యప్రకాష్ టైల్స్ వర్క్ చేస్తుంటాడు. తల్లి మరణించింది. అక్కాచెల్లెళ్లకు వివాహాలు జరిగాయి. తండ్రి పట్టపు బాజ్జీతో కలిసి జీవిస్తున్నాడు. వారం రోజుల క్రితం తండ్రి విజయవాడలో కూతురు వద్దకు వెళ్ళాడు. సూర్యప్రకాష్ కూడా వెళ్ళి ఉంటాడని అందరూ భావించారు. సోమవారం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో సమీపంలోని వారు కిటికీ నుంచి చూశారు. సూర్యప్రకాష్ మృతదేహం వేలాడుతూ కనిపించింది. వారం రోజులు క్రితం ఉరి వేసుకుని ఉంటాడని భావిస్తున్నారు. తండ్రీకొడుకులు తరుచూ గొడవలు పడేవారని తెలిసింది. పంచాయతీ సిబ్బంది మృతదేహాన్ని ఖననం చేశారు. ఈ ఘటనపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు కాలేదు.

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం



కుంచనపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి వారి ఆలయానికి కోటిపల్లి శ్రీనివాస రావు–ఆదిద్య భవానీ దంపతులు రూ.58,116 లను విరాళంగా ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారికి ఆలయ ట్రస్ట్, కమిటీ సభ్యులు వారిని ఘనంగా సత్కరించారు.

లయన్స్ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు స్పోర్ట్స్ కిట్ అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు, గ్యాట్ అంబాసిడర్ కొత్తపల్లి రవి కుమార్ ఆధ్వర్యంలో స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు స్నాక్స్, స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో యర్రా ఆంజనేయస్వామి, సత్యనారాయణ, భవిత సెంటర్ నిర్వాహకులు బాల ఈశ్వరయ్య, చంద్ర కుమారి, సత్యవతి, నాగలక్ష్మి, దివ్యాంగుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బొండాడలో అన్నసమారాధన

కాళ్ల: బొండాడ గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఉండి మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నే నాగరాజు తెలిపారు. గ్రామంలో కొలువుదీరిన అమ్మవార్ల జాతర మహోత్సవాలు సోమవారంతో ముగిసాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత అమ్మవార్లకు వివిధ రకాల పిండి వంటలతో నైవేద్యం సమర్పించారు. భక్తులు, దాతల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దఎత్తున భక్తులు హాజరై అమ్మవార్ల ప్రసాదం స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు, పెద్దలు మన్నే శ్రీనివాసు, కందుల హనుమబాబు, మన్నే సోమేశ్వరరావు, మందపాటి రవి, కట్టా సుబ్బయ్య, పెనుమత్స రంగరాజు, కళ్లింపూడి వెంకన్న, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

నవోదయకు ఎంపికైన విద్యార్థిని



నవోదయకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆకివీడు: నవోదయలో చదివేందుకు స్థానిక ఈస్టుపాలెం ఎంపీపీ స్కూల్ విద్యార్థిని యూ. జోషిత శ్రీ వర్షిని ఎంపికయ్యారు. నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణతా మార్కులు సాధించిదని హెచ్‌ఎం వీ.వర్షిని సోమవారం విలేకర్లకు తెలిపారు. ఐదో తరగతి చదువుతున్న ఆమె ఆరో తరగతిలో ప్రవేశ పరీక్ష రాసినట్లు, ఏలూరు దగ్గర పెదవేగిలో నవోదయ స్కూల్‌లో త్వరలో చేరనున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి

ఉండి: సరిహద్దు గోడ వద్ద మొదలైన తగాదా మహిళపై దాడికి కారణమైంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం మహదేవపట్నం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన కడలి లక్ష్మి ప్రహరీ గోడకు ఆనుకుని ఆమె బావ అయిన కడలి రాంబాబు గోడ కడుతుండగా అలా ఎందుకు కడుతున్నావంటూ అతని తమ్ముడు, లక్ష్మి భర్త అయిన రామాంజనేయులు ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. రాంబాబు కుమారుడు వెంకన్న ఇనుప రాడ్డుతో లక్ష్మి తలపై, ఛాతీపై కొట్టడంతో ఆమె గాయపడింది. దీంతో చికిత్స నిమిత్తం ఆమెను భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పేరుపాలెంలో పోలీసుల కవాతు

మొగల్తూరు : ఎన్నికల నేపథ్యంలో ఓటర్లలో మనోధైర్యం నింపేందుకే కవాతు నిర్వహిస్తున్నామని సీఐ కె.గోవింద్‌రాజు అన్నారు. సోమవారం మొగల్తూరు మండలం పేరుపాలెం నార్త్, సౌత్ గ్రామాల్లోని అంగజాలపాలెం, తెన్నేటిపేట, కవురువారిపాలెం తదితర ప్రాంతాల్లో సీఐఎస్ఎఫ్, సివిల్ పోలీసులు కవాతు నిర్వహించారు.

మాతా, శిశువు భద్రంగా..



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చంటిబిడ్డతో తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న దృశ్యం



తణుకులో తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా కూర్చున్న బాలింత

- ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్
- తణుకు డివిజన్‌లో అందుబాటులో ఆరు వాహనాలు
- నిత్యం 10 నుంచి 15 మందిని తరలిస్తున్న వైనం..

తణుకు అర్బన్: మాతృత్వం అనేది మాటల్లో చెప్పలేని అనుభూతి. నవమాసాలు మోసి, కన్న పసికందును చూడగానే ఆతల్లి తాను పడ్డ పురిటి నొప్పులంటినీ మరిచిపోయి ఆనందంతో పొంగిపోతుంది. ఒకింత గర్వంగా కూడా ఫీలవుతుంది. తల్లి కడుపులో నుంచి ఈ లోకంలోకి ప్రవేశించిన పురిటి బిడ్డను, బాలింతను ఆస్పత్రి నుంచి సురక్షితంగా ఇంటికి చేర్చే బాధ్యతను ప్రభుత్వం స్వీకరించింది. మాతృమూర్తి ఎలాంటి ప్రయాస పడనవసరం లేకుండా ప్రభుత్వమే అన్ని ఆస్పత్రుల్లోనూ ప్రసూతి సేవలను ఉచితంగా అందజేస్తోంది. గర్భిణులు నెలలు నిండిన తరువాత, నొప్పులు వచ్చిన క్రమంలో 108 వాహనాల ద్వారా తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చేరుతుండగా, ప్రసవానంతరం తల్లి బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా బాలింతలు జిల్లాలోని వివిధ గ్రామాల్లోని తమ సొంత ప్రాంతానికి చేరుకుంటున్నారు. గతంలో ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ఇబ్బందులపాలయ్యే పరిస్థితి ఉండగా, ఇప్పుడు ఆ పరిస్థితులను అధిగమించి తల్లీ బిడ్డ వాహనాలు విశేష సేవలందిస్తున్నాయి.

6 వాహనాలతో సేవలు..

తణుకు జిల్లా కేంద్రఆస్పత్రిలో 6 వాహనాల ద్వారా ప్రతిరోజూ 10నుంచి 15కేసుల వరకు బాలింతలను వారి స్వస్థలాల్లోని గృహాలకు చేరుస్తున్నారు. 150 పడకలున్న తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నిత్యం 500లకు పైగా అవుట్ పేషెంట్స్ వస్తుండగా అందులో 150వరకు గర్భిణులు వస్తుంటారు. వీరిలో నార్మల్ డెలివరీలు, సిజేరియన్‌లు కలిపి రోజుకు 15 నుంచి 20 మంది గర్భిణులు వైద్యసేవలు పొందుతున్నారు. సులువుగా ప్రసవం అయిన బాలింతలు 3 రోజులకు, సిజేరియన్ చేయించుకుని బిడ్డను కన్న బాలింతలు 7వ రోజున ఇంటికి పంపిస్తుంటారు. ఈ క్రమంలో ప్రతిరోజూ ప్రసవాలకు సంబంధించిన వార్డులో ఉన్న వైద్య సిబ్బంది ఇచ్చిన వివరాల ప్రకారం తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన సిబ్బంది జిల్లా నలుమూలల ఉన్న తమ ఇళ్లకు బాలింతలను సురక్షితంగా చేరుస్తున్నారు.

సురక్షితంగా చేరుస్తున్నాం



తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ప్రసవమైన బాలింతలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల ద్వారా సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న 6 వాహనాల ద్వారా ప్రతిరోజూ సుమారుగా 10 నుంచి 15 మంది బాలింతలు వారి ఇళ్లకు చేరుకుంటున్నారు. సేవలు వినియోగించుకున్న వారంతా చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– డాక్టర్ దాట్ల సుందరరామరాజు,
తణుకు జిల్లా కేంద్ర ఆస్పత్రి అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు

తల్లీబిడ్డ వాహన సేవలు బాగున్నాయి



తల్లీబిడ్డ వాహనాలు అందుబాటులో లేని రోజుల్లో ప్రభుత్వాసుపత్రి నుంచి బాలింతలు ఆటోలు, ఇతర ప్రైవేటు వాహనాల ద్వారా వారి ఇళ్లకు చేరాల్సివచ్చేది. తల్లీబిడ్డ వాహనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎటువంటి ఇబ్బందులు లేకుండా బాలింతను ఆస్పత్రి నుంచి డిశ్చార్జి పెట్టగానే తల్లీబిడ్డ వాహన సిబ్బంది వెళ్లి స్వయంగా రిసీవ్ చేసుకుని వారి ఇంటిముందు క్షేమంగా దింపుతున్నారు.

– షేక్ అబ్దుల్ ఖాదర్ జిలాని, తణుకు

కాపులకు సముచిత ప్రాధాన్యం

- ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- దర్శిపర్రులో ఆత్మీయ సమ్మేళనం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రాష్ట్రంలో కాపులకు సముచిత స్థానం ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నతోనే సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. పెంటపాడు మండలం దర్శిపర్రు గ్రామంలో కాపుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యలో హాజరైన కాపులను ఉద్దేశించి కొట్టు సత్యనారాయణ మట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యమవుతుందన్నారు. ప్రధానంగా ఏనాడు ఏ ముఖ్యమంత్రి కాపులకు సముచిత స్థానం ఇవ్వలేదన్నారు. జగనన్న ముఖ్యమంత్రి ఆయ్యాక కాపు జాతి అందరి కోసం ఉపముఖ్యమంత్రి పదవి ఇచ్చి కాపుల నుంతా ఐక్యంగా గౌరవించారన్నారు. గతంలో చంద్రబాబు కాపులను బీసీల్లో చేరుస్తామని మాయ మాటలు చెప్పారని విమర్శించారు. కాపులను జన సేన అధినేత తీవ్రంగా వంచించారన్నారు. కేవలం తక్కువ సీట్లు ఇచ్చి చంద్రబాబు నయవంచన చేశారన్నారు. ఆ విషయం పవన్ తెలుసుకోలేక పోతున్నారన్నారు. ఈ సారి ఎమ్మెల్యేగా తనను మరోసారి గెలిపించాలని నాయకులను కోరారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థుల విషయంలో గూడెం ప్రజలు ఆత్మపరిశీలన చేసుకొని ఓటు వేయాలని మంత్రి కొట్టు అభ్యర్థించారు. ఏనాడూ పొత్తులతో అవకాశం లేకుండా సీఎం జగన్ ప్రజా సమస్యలే అస్త్రాలుగా ఆయన ప్రజల పక్షాన పోరాడారన్నారు. ఉన్నతమైన రాజకీయం జగనన్న సొంతమన్నారు. అధికారం చేపట్టిన ఆయన సంక్షేమం కోసం ఆహర్నిశలు శ్రమించారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసిన వ్యక్తికి ఓట్లు అడిగే ధైర్యం కూడా ఉంటుందన్నారు. ఈ ఎన్నికలలో 175 స్థానాలు గెలవడం ఖాయమన్నారు. ఎన్నికల కోసం పొత్తులు పెట్టుకొని చంద్రబాబు ప్రజలను మోసం చేయడానికి సిద్ధమయ్యాడని ఆరోపించారు. వలంటీర్ల ద్వారా అద్భుత పాలన అందుతుందున్న అక్కసుతో వారిని తీవ్రవాదులుగా తెదేపా నాయకులు చిత్రీకరించడం సరికాదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆక్వా అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు వడ్డి రఘురాం మాట్లాడుతూ జగనన్నకు వస్తున్న ఆదరణ చూసి తట్టుకోలేక అన్ని పార్టీలు కూటమిగా ఏర్పడుతున్నాయన్నారు. గతంలో ఈ కూటమి వల్ల ఒరిగింది శూన్యమన్న సంగతి ప్రజలకు తెలుసన్నారు. సీఎంగా జగనన్న వస్తే మరిన్ని పథకాలు ప్రజలు నేరుగా అందుతాయన్నారు. ఎమ్మెల్యే కొట్టు సత్యనారాయణను, ఎంపీగా ఉమాబాలను గెలిపించుకోవాలన్నారు. కొట్టు ద్వారానే గూడెం అభివృద్ధి సాధ్యమన్న సంగతిని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్, గుండుమోగుల సాంబయ్య, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, చోడగిరి చినబాబు, కర్రి భాస్కరరావు, దేవరశెట్టి రాంబాబు, పాలా గణపతి, ములగాల రామసత్యనారాయణ, సొసైటీ మాజీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ, కైగాల గణపతి, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, కొలుకులూరి దర్మరాజు, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావు, గుండుమోగుల మునీంద్ర, దెయ్యం శ్రీనివాసరావు, కుంచే సుబ్రహ్మణ్యం, సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు పెన్నాడ సూరిబాబు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, ములగాల బాబ్జి, దేవ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెరువులను పూర్తిస్థాయిలో నింపాలి

యలమంచిలి: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని నరసాపురం డీఎల్‌పీఓ జె.సత్యనారాయణ అన్నారు. చించినాడ, ఊటాడ, యలమంచిలి, కాజ తూర్పు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పంచాయతీ కార్యదర్శులకు వివరించారు. కాలువలు కట్టేసే సమయానికి చెరువుల్లో కనీసం 40 శాతం నీరు ఉండేలా ఇప్పుడే చర్యలు తీసుకోవాలన్నారు. మంచినీటి చెరువులకు వంతు ఇచ్చిన సమయంలో పూర్తిస్థాయిలో నింపాలని ఆదేశించారు. పైపులైన్, కుళాయి లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు

పోడూరు: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా తగినచర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ డి.సుహాసిని సచివాలయ కార్యదర్శులను ఆదేశించారు. పోడూరు, జిన్నూరు గ్రామాల్లో సోమవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు, ఫిల్టర్‌బెడ్లు, ఓవర్‌హెడ్ ట్యాంకులను, పంప్‌హౌస్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. సర్పంచ్‌లు శెట్టిబత్తుల సువర్ణరాజు, జమ్ము బేబీ మహాలక్ష్మి, ఈఓపీఆర్‌డీ ఎం.బలరామరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బుజ్జేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు వి.రాంబాబు, పి.రవి ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

- సీఎం జగన్‌ను ప్రజలు ఆశీర్వదిస్తున్నారు
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు 27వ వార్డులో ఎన్నికల ప్రచారంలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: రావాలి జగన్.. కావాలి జగన్ అంటూ ప్రతి గడపలోను ప్రజలు స్వాగతం పలుకుతున్నారని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 23, 27 వార్డుల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మళ్లీ జగన్ ముఖ్యమంత్రిగా వస్తేనే మాకు పారదర్శకంగా సంక్షేమం అందుతుందనే విషయాన్ని ప్రజలు గ్రహించారని, అందుకే ప్రతి గడపలోను మాకు హారతులు పడుతున్నారని స్పష్టం చేశారు. అవ్వా, తాతలకు 1వ తేదీన పింఛన్ అందాలన్నా, అక్క, చెల్లెమ్మలకు సంక్షేమ పథకాల తాలూకా లబ్ధి నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావాలన్నా జగనే సీఎంగా రావాలని వారు కోరుకుంటుండడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబుకు అవకాశం ఇస్తే వలంటీరు వ్యవస్థను నిలుపుదలచేసి, సంక్షేమ పథకాలను సైతం తొలగించేస్తాడని ప్రజలే మాకు ఎదురుచెబుతున్నారని అన్నారు. ఈ సందర్భంగా గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాల్సిందిగా మంత్రి కారుమూరి ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, జేసీఎస్ పట్టణ కన్వీనర్ యిండుగపల్లి బలరామకృష్ణ, వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ దాట్ల సుందరరామరాజు, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఝూన్సీ లారెన్స్, నమ్మి వాసు, తిరునాల శకుంతల, మారిశెట్టి శేషగిరి, గెద్దాడ శ్రీకాంత్, తాటిపర్తి వాసు, గోడి నాగబాబు, డీజే అమూల్యారావు, ఎస్వీ జాకబ్‌బాబు, పైబోయిన ఏసుబాబు, వీరమల్లు ఫణీంద్రకుమార్, చేశెట్టి లలితా శంకర్, కారుమంచి యోహాన్ పాల్గొన్నారు.



మంత్రి కారుమూరిని సత్కరించిన కార్పెంటర్స్ సంఘ నాయకులు

తణుకు కార్పెంటర్స్ సంఘం చేస్తున్న సేవలు అభినందనీయం

తణుకు అర్బన్: తణుకు పట్టణ కార్పెంటరీ సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 27వ వార్డు నమ్మి వాసు టింబరు డిపోలో సోమవారం నిర్వహించిన తణుకు పట్టణ కార్పెంటర్స్ సంఘం ఆత్మీయ సమావేశంలో మంత్రి కారుమూరి మాట్లాడారు. కార్పెంటర్స్ అంతా స్వయం ఉపాధితో జీవనం సాగిస్తూనే ఇబ్బందుల్లో ఉన్న సంఘ సభ్యులకు అండగా నిలబడడంతో పాటు వార్షికోత్సవం రోజున చేస్తున్న సేవా కార్యక్రమాలు మిగిలిన సంఘాలను సైతం ఆలోచింప జేస్తున్నాయని అన్నారు. నా వంతుగా సంఘానికి స్థలసేకరణ చేసి భవనం కట్టిచ్చేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. మా ప్రభుత్వం ఏర్పడిన 6 నెలల కాలంలో ఈ పనిని పూర్తిచేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో 5గురు సభ్యులకు బియ్యం బస్తాలను మంత్రి కారుమూరి చేతులమీదుగా అందచేశారు. ముందుగా మంత్రి కారుమూరిని సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టింబరు డిపో అధినేత నమ్మి శ్రీనివాస్ (వాసు), సంఘం జిల్లా కార్యదర్శి వెంపటాపు శ్రీమన్నారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి గోడి నాగబాబు, తణుకు పట్టణ సంఘం అధ్యక్షులు కలగర్ల శేషగిరిబాబు, కార్యదర్శి కాపోలు కొండబాబు, కోశాధికారి చిక్కాల సూర్యనారాయణ, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణ అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణ రావు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమల నియంత్రణ అందరి బాధ్యత అని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలైన యాగర్లపల్లి, బీబీసెంటర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ల్లో సోమవారం డాక్టర్ శ్రావ్య, డాక్టర్ తనూజ అధ్యక్షతన ఆశా డే నిర్వహించారు.ఈ సందర్భంగా వై.వి.లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. హెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్‌లో అపరిశుభ్ర వాతావరణం ఉన్న ప్రాంతాలను నమోదు చేయాలని, పంచాయతీ వారి సహకారంతో పరిష్కరించాలని, ప్రజారోగ్యాన్ని కాపాడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆశ నోడల్ అధికారులు వై.సుజాత, ఎం.మంగతాయారు, వార్డు ఆరోగ్య కార్యకర్తలు, సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో బూత్ కమిటీలదే కీలక పాత్ర

ఇరగవరం: మండలంలోని ఏలేటిపాడు గ్రామంలో సోమవారం ఇరగవరం మండల నాయకులు బూత్‌లెవెల్ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, ఎంపీపీ వెలగల సాయి బాబారెడ్డి మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బూత్ కమిటీల పాత్ర కీలకమని అన్నారు. అందరూ కలిసికట్టుగా పని చేసి ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు మండల, నియోజకవర్గ నాయకులు దృష్టికి తీసుకు రావాలన్నారు. ఈ 58 నెలల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందజేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, నాయకులు చింతా బాపిరెడ్డి, సత్తి వెంకట రెడ్డి, కొవ్వూరి శ్రీనివాస్‌రెడ్డి, చోడే ఏసురత్నం, కుడిపూడి శ్రీను, గుత్తుల గణేష్, అత్తిలి ఏఎంసీ వైస్ చైర్మెన్ మామిడిశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు



మజ్జిగ చలివేంద్రంను ప్రారంభిస్తున్న ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు

ఆకివీడు: వేసవిలో దాహార్తిని తీర్చేందుకు మాదివాడలోని రంగా విగ్రహం వద్ద రాధా రంగా మిత్ర మండలి ఆధ్వర్యంలో ప్రతి ఏటా మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు, స్థానిక ఏఎంసీ మాజీ చైర్మన్ మోటుపల్లి గంగాధరరావు తెలిపారు. స్థానిక మాదివాడ సెంటర్‌లో సోమవారం మజ్జిగ చలివేంద్రంను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా మజ్జిగ చలివేంద్రంను రాధా రంగా మిత్రమండలి సభ్యులు నిమ్మల నాగు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. దాతల సహకారంతో ప్రతి రోజూ 2000 లీటర్ల మజ్జిగతో పాదాచారుల దాహార్తిని తీర్చడం గర్వించదగ్గ విషయమన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా ఇటువంటి సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మిత్రమండలి సభ్యులు నిమ్మల నాగు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ మస్తాన్ వలీ, నగర పంచాయతీ వైస్ చైర్మన్ పుప్పాల పండు, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అంబటి రమేష్, దాసరి బాలకృష్ణ, పుప్పాల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆశాజనకంగా వరి పైరు

- అధిక దిగుబడుల దిశగా ఎంటీయూ 1293 వంగడం
- కుప్పనపూడిలో చెరువుల మధ్య సాగు



కుప్పనపూడిలో చెరువుల మధ్య పొలంలో ఏపుగా ఎదుగుతున్న ఎంటీయూ 1293 వరి వంగడం

ఆకివీడు : నూతన వరి వంగడం ఎంటీయూ 1293 వంగడం దిగుబడులు ఆశాజనకంగా కన్పిస్తున్నాయి. రబీ సాగులో సెలనిటీని తట్టుకుని పంట అద్భుతంగా ఎదుగుతోంది. 2022లో మార్టేరు వరి పరిశోధనా సంస్థ ఈ వంగడాన్ని రూపొందించింది. ఎంటీయూ 1010, ఎఫ్ఎల్ 478బై3 సంకరణ ద్వారా ఎంటీయూ 1293 వంగడం రూపొందించారు. సాగు కాలపరిమితి 122 రోజులు కాగా, వరి మొక్క 120 నుంచి 125 సెంటీమీటర్ల ఎత్తు ఎదుగుతుంది. పడిపోయే గుణం లేదు. గింజ పొడవు, సన్నం, పొడవు, వెడల్పుల నిష్పత్తి 3.18. దీంతో దీనిని సూపర్ ఫైన్ రకం వంగడంగా గుర్తించి రైతులకు మినీ కిట్లుగా రబీ సాగులో మార్టేరు వరి పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు అందజేశారు. చౌడు నేలల్ని తట్టుకుని, వరి కంకులు పుష్కలంగా గింజలతో గలగలాడుతూ ఉంటాయి. పొట్టకుళ్లు, టుంగ్రో వైరస్, అగ్గితెగులు, గోధుమ రంగు తెగులును మధ్యస్తంగా తట్టుకుంటుంది. చౌడు నేలల్లో సాగుకు ప్రత్యామ్నాయ రకంగా శాస్త్రవేత్తలు గుర్తించినట్లు మార్టేరు శాస్త్రవేత్త కృష్ణాజీ చెప్పారు. ఎకరాకు దిగుబడి 1.5 నుంచి 2.2 టన్నులు, చౌడు భూముల ప్రాంతాల్లో 2.2 నుంచి 2.24 టన్నుల దిగుబడి వస్తుందని కృష్ణాజీ వివరించారు. కుప్పనపూడిలో ఆదర్శ రైతు నంద్యాల చల్లారావు పొలంలో వెదజల్లు, సాధారణ సాగు పద్ధతుల్లో ఎంటీయూ 1293 వంగడం సాగు చేసినట్లు ఆయన తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల గుర్తింపుకు ఏఐటీయూసీ కృషి

తాడేపల్లిగూడెం రూరల్: భవన నిర్మాణ కార్మికుల కష్టానికి తగిన గుర్తింపు, వృత్తికి గౌరవం తీసుకురావాడనికి చిరకాలంగా ఏఐటీయూసీ కృషి చేస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ అన్నారు. సోమవారం మండలంలోని మాధవరం గ్రామంలో భవన నిర్మాణకార్మిక సంఘ మండల శాఖ సమావేశం సంఘ గ్రామ అధ్యక్షుడు గంధం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. సోమసుందర్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంఘంలో రాష్ట్రంలో 22లక్షల మంది సభ్యులుగా చేరారని, వేల కోట్ల రూపాయలు నిధులు వెల్ఫేర్ సెస్‌గా బోర్డుకు జమ అయ్యాయని, కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలయ్యాయని వివరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు సభ్యత్వాల చేర్పులు, పునరుద్ధరణ కార్యక్రమాలు కొనసాగించాలని కోరారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పిల్లంగోళ్ల కృష్ణ, బండి సర్వేశ్వరరావు, సిద్ధిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.